

రేపు జిల్లాస్థాయి ఓపెన్ తైక్వాండో పోటీలు

శ్రీకాకుళం : నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆడిటోరియం వేదికగా ఈనెల 29న జిల్లాస్థాయి తైక్వాండో పోటీలను నిర్వహిస్తున్నట్లుగా తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తైక్వాండో శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. కొన్న చిన్నారావు మెమోరియల్ పేరిట ఓపెన్ తైక్వాండో పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ గుర్తింపు పొందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొవచ్చని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో సబ్ జూనియర్స్, క్యాడెట్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు ఈనెల 28వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా పేర్లు, ఇతర వివరాలను తెలియజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 8919591487 ఫోన్ నంబరును సంప్రదించాలని తెలిపారు.

జిల్లా ఓటర్లు 18,27,143

- ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల
- మార్పులు, చేర్పులకు డిసెంబర్ 9 వరకు అవకాశం
- సర్వీసు ఓటర్లలో జిల్లా ప్రథమ స్థానం
- జనవరి 5న తుదిజాబితా
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో 18,27,143 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వెల్లడించారు. ఇందులో 9,08,440 మంది పురుషులు, 9,18,528 మహిళా ఓటర్లు ఉన్నారని తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు తొమ్మిదో తేదీ వరకు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఫిర్యాదుల కోసం నవంబర్ 4, 5, డిసెంబరు 2, 3 తేదీల్లో ఆయా పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులతో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12వ తేదీ వరకు వచ్చిన ఫిర్యాదుల పరిశీలన పూర్తి చేసి, డిసెంబర్ 26వ తేదీ నాటికి వాటిని పరిష్కరించి జనవరి ఒకటో తేదీ నుంచి చివరి దశ పరిశీలన పూర్తయిన అనంతరం ఐదో తేదీన తుది జాబితాను విడుదల చేస్తామని చెప్పారు. పలు అభ్యర్థనల మేరకు చనిపోయిన ఓట్ల తొలగింపు, స్థానికంగా నివాసం లేకపోవడం తదితర క్లయిమ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, 96 వేల మంది ఓట్లను తొలగించినట్లు తెలిపారు. జిల్లాలో 2,357 పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ప్రతి వెయ్యి మంది జనాభాలో 758 మంది ఓటర్లున్నారని, సర్వీసు ఓటర్ల సంఖ్య 16,162గా ఉందని చెప్పారు. రక్షణ, ఇతర కేంద్ర సర్వీసుల్లో ఉన్న సర్వీసు ఓటర్లు ఎక్కువగా ఉన్న జిల్లాగా రాష్ట్రంలోనే శ్రీకాకుళం మొదటిస్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలో 18, 19 ఏళ్ల మధ్య 50 వేల మంది వరకు నూతన ఓటర్లుగా నమోదు కావాల్సి ఉందని అంచనా వేయగా, 20వేల మంది మాత్రమే నమోదు చేసుకున్నారని తెలిపారు. త్వరలోనే ప్రత్యేక క్యాంపెయిన్ చేపడతామన్నారు. ఫైనల్ రోల్‌ను మదర్ రోల్‌గా పరిగణిస్తామని, జనవరి తర్వాత ఓటర్లుగా నమోదయ్యే వారిని సప్లిమెంటరీ రోల్‌లో పొందుపరుస్తామని వివరించారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరూ ఓటు హక్కు పొందేలా బిఎల్ఒ స్థాయి నుంచి చర్యలు చేపడతామన్నారు. బిఎల్ఒ స్థాయి నుంచి ఎఇఆర్ఒ, ఇఆర్ఒ స్థాయిలో ఫిర్యాదుల పరిష్కారానికి వ్యక్తిగతంగా ఐదు కంటే ఎక్కువ ఫిర్యాదులను అంగీకరించబోమని స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ఓటు హక్కు ఇలా తెలుసుకోవచ్చు

ఓటర్లు తమకు ఓటు హక్కు ఉన్నదీ లేనిదీ తెలుసుకునేందుకు బూత్ లెవల్ ఏజెంట్లను సంప్రదించాలని సూచించారు. ఇసిఐ వెబ్‌సైట్ www.voters eci.gov.in ద్వారా కూడా సమాచారాన్ని తెలుసుకోవచ్చుని, లేదా ఓటర్ హెల్ప్ లైన్ (విహెచ్ఎ) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఓటు వివరాలను తెలుసుకోవచ్చున్నారు. టోల్ ఫ్రీ నెంబరు 1950 ద్వారా కూడా సమాచారం తెలుసుకోవచ్చున్నారు. ఒకవేళ పేరు లేకపోయినా ఫారం-6ను సమర్పించడం ద్వారా ఓటు హక్కును పొందవచ్చుని స్పష్టం చేశారు. .సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఉన్నారు.



పోలీస్ ఆయుధాల ప్రదర్శన

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వు కమ్యూనిటీ హాల్లో పోలీస్ ఆయుధాల ప్రదర్శన (ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్)ను ఎస్‌పి జి.ఆర్ రాధిక శుక్రవారం ప్రారంభించారు. పోలీసులు విధి నిర్వహణలో నిత్యం ఉపయోగించే ఆయుధాలు, వాటి పనితీరు, సాంకేతిక పరికరాలు, పోలీసు జాగిలాలు, బాంబు నిర్వీర్య సాధనాలు, మెటల్ డిటెక్టర్, డ్రాగన్ లైట్, రాకర్, ఫింగర్ ప్రింట్, పోలీస్ కంట్రోల్‌రూమ్, కమ్యూనికేషన్ మ్యాన్ ప్యాక్ సెట్స్ గురించి ఎస్‌పి స్వయంగా విద్యార్థులకు వివరించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌ను విద్యార్థులు తిలకించాలన్నారు. పోలీసులు విధి నిర్వహణలో భాగంగా వారు వినియోగించే ఆయుధాలు, దుస్తులు, పనిముట్లు, నేర దర్యాప్తు విధానం, కమ్యూనికేషన్ తదితర విషయాలను ప్రజలు, విద్యార్థులకు



తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల శ్రేయస్సు, దేశ రక్షణకు ప్రాణాలు అర్పించిన వారి త్యాగాలను స్మరించుకుంటూ అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని సర్కిల్, సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి టి.పి విఠలేశ్వర్, సిఐ ఆదాం, ఆర్ఐ ఉమామహేశ్వరరావు, ఎస్ఐ రాజేష్, ఆర్ఎస్ఐలు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్పీకర్ అయితే మాట్లాడకూడదా..?

- జనం మధ్యలో ఉంటా... వారి కోసమే పనిచేస్తా
- శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - పొందూరు

తాను జనం మధ్యలో ఉంటానని, జనం కోసం పనిచేస్తానని స్పీకర్ అయినంత మాత్రాన ఏం మాట్లాడకూడదా, అలా ఏ రాజ్యాంగంలో రాసి ఉందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని గోకర్ణపల్లిలో సర్పంచ్ చింతాడ మాధురి ఆధ్వర్యాన చేపట్టిన పలు అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం భవనం, రూ.ఐదు లక్షలతో కొత్తవీధి సిసి రోడ్డు, రంగనాథపేటలో జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రూ.65 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాంకు, ఇంటింటా కుళాయిలు, రూ.నాలుగు లక్షలతో చేపట్టిన శ్మశానవాటిక రహదారులను, మున్సీపేటకు ఎఐఐబి నిధులతో చేపట్టిన బిటి రహదారి ప్రారంభించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సాగు, తాగునీరు, రహదారులు వంటి మౌలిక వసతుల కల్పనే తన లక్ష్యమన్నారు. గ్రామాల అభివృద్ధికి అందరూ కలసికట్టుగా పనిచేయాలని, అలా కాకుండా అభివృద్ధిని అడ్డుకోవాలనుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, మాజీ ఎంపిటిసి చింతాడ సత్యప్రసాద్, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కె.రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సిసి రహదారిని ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

పంట భూములకు చుక్క నీరు ఇచ్చారా..?

ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - మందస, టెక్కలి

పలాస నియోజకవర్గంలో మంత్రి అప్పలరాజు కొండలు, గుట్టలు, వాగులు, వంకలు దోచుకోవడంపై చూపించిన శ్రద్ధ రైతులపై చూపించరా అని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రశ్నించారు. మందస మండలం బిన్నల మదనాపురంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి టిడిపి విస్తృతస్థాయి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్లలో శివారు భూములకు వంశధార నీరు ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రతి సమావేశంలో కింజరాపు అచ్చెన్నాయుడు వల్లే పంట భూములకు సాగునీరు ఇవ్వలేకపోతున్నామని చెప్పడానికి సిగ్గు అనిపించడం లేదా అని అన్నారు. గతంలో గౌతు శివాజీ శివారు భూములకు సాగునీరు అందించే వరకు ప్రభుత్వంతో పోరాడి సాగునీరు అందించారని చెప్పారు. నేడు మంత్రి పలాస నియోజకవర్గానికి సాగునీరు ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి చేయాలని గెడ్డం దీక్ష చేపట్టి నిధులు మంజూరు చేయించిన ఘనత శివాజీకే దక్కుతుందన్నారు. మంత్రి స్థానంలో ఉండి జీడి రైతుల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. రైల్వేవంతెన, కెటి రోడ్డు విస్తరణ పనులు ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. మంత్రికి తెలిసిందల్లా నెమలికొండ, సూదికొండ, నల్లబుడ్లూరు కొండలు మాయం చేసి అమ్ముకోవడమేనని ఆరోపించారు.

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శివాజీ మాట్లాడుతూ వైసిపి పాలనలో టిడిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి భయపెట్టడం తప్ప చేసిందేమీ లేదన్నారు. టిడిపి, జనసేన నాయకులు సమిష్టిగా పనిచేయాలని, విభేదాలకు తావు లేకుండా టిడిపి గెలుపే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వైసిపి నుంచి టిడిపిలో చేరిన వారిని పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్‌రావు, ఎల్.కామేశ్వరరావు, మండల అధ్యక్షులు భావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపాలి

అధికార వైసిపి ప్రభుత్వ ఆగడాలు పెచ్చుమీరుతున్నాయని, ఈ అరాచక ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందని ఎంపీ రామ్మోహన్‌నాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. భవిష్యత్‌కు గ్యారంటీ నినాదంతో టిడిపి టెక్కలి నియోజకవర్గ సమావేశం స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే గొంతులను పోలీస్ జులుంతో అణచివేస్తున్నారని చెప్పారు. ఏం అభివృద్ధి చేశారని వైసిపి నాయకులు బస్సు యాత్రను చేపడుతున్నారని ప్రశ్నించారు. సమావేశంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, ఎమ్మెల్యే బెందాళం ఆశోక్, గౌతు శిరీష, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల అధ్యక్షులు బగాది శేషగిరి, జీరు భీమారావు, పినకాన ఆజయ్, బోయిన గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రదేముడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

మారుతున్న కాలానికి అనుగుణంగా కల్లుగీత వృత్తిని ఆధునీకరించి గీత కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రదేముడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఒప్పంగిలో శుక్రవారం నిర్వహించిన గీత కార్మికుల జిల్లా 5వ మహాసభలో ఆయన మాట్లాడారు. కల్లుగీత కార్పొరేషన్‌కు రూ.ఐదు వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కల్లుకు బ్రాండ్ కేటాయించి, గీత వృత్తిని పరిశ్రమగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో కల్లు గీత కార్మికులకు అనేక వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించారని విమర్శించారు. పక్క రాష్ట్రాల్లో గీత వృత్తిని కాపాడుతూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ఆ విధంగానే రాష్ట్రంలోనూ అమలు చేయాలన్నారు. ప్రమాదానికి గురైన ప్రతి కార్మికునికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి దేవ్ మాట్లాడుతూ గీత వృత్తిపై ఆధారపడిన కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం ద్వారా కృషి చేస్తున్నట్లు తెలిపారు. సంఘ రాష్ట్ర నాయకులు శిమ్మ అప్పారావు మాట్లాడుతూ వృత్తిపై ఆధారపడిన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కల్లులోని పోషకాలపై ప్రభుత్వ ప్రచారం చేసి మార్కెట్ సౌకర్యం కల్పిస్తే, గీత కార్మికులకు ఉపాధి లభిస్తుందన్నారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోట అప్పారావు, దుబ్బ కోటేశ్వరరావు మాట్లాడుతూ వృత్తి కార్మికులపై ప్రభుత్వానికి చిన్నచూపు తగదన్నారు. కల్లును నిల్వ ఉంచే పద్ధతిలో బాటలింగ్ సిస్టం చేసి స్టార్ హోటళ్లలో అమ్మే విధంగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. పాలు సేకరణ చేసినట్లు కల్లు సేకరణ చేసి ఆహార పదార్థాలుగా తయారు చేసే పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో సంఘ నాయకులు జి.ఎర్రయ్య, ఎస్.వెంకటరమణ, పి.వేణుగోపాల్, గీత కార్మికులు పాల్గొన్నారు.



పిల్లలకు మత్తు ఔషధాల విక్రయం నేరం

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వైద్యుల సిఫార్సు లేకుండా పిల్లలకు ఎటువంటి మత్తు ఔషధాలను విక్రయించరాదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం స్పష్టం చేశారు. అలా విక్రయించే దుకాణాలు, వ్యక్తులపై కఠిన చర్యలకు అధికారులకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. నగరంలోని జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో బాలలకు మత్తు ఔషధాల విక్రయ నియంత్రణలో అధికారులు, ఔషధ దుకాణ యజమానుల పాత్రపై శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దల తోడు లేకుండా పిల్లలు నేరుగా వైద్యుల సిఫారసు చీటీలు లేకుండా మందుల దుకాణాలకు వస్తే కోరెక్స్ వంటి దగ్గుమందులు ఆల్ప్రోజోలం, బెంజోడియ జెపినిస్, డయాజెపం, నైట్రాజెపం, ఆల్ప్రెక్స్, రెస్టిల్ వంటి మందులే కాకుండా ఒపియోయిడ్స్, మోర్ఫైన్, కోడైన్, ఫెంటాలైనేటిక్ వంటి మత్తు ఇంజెక్షన్లు విక్రయించడం చట్ట విరుద్ధమన్నారు. ఇలా చేయడం బాలల మానసిక ఆరోగ్యాలతో ఆటలాడడమే అవుతుందన్నారు. ఇటువంటి అమ్మకాలు చేసే ఔషధ దుకాణాలపై ప్రత్యేక దృష్టిసారించడంతో పాటు నిఘాను తీవ్రతరం చేయాలని ఎస్‌పికి ఆదేశాలు జారీ చేశామన్నారు. పిల్లలకు ఇటువంటి మందుల విక్రయాలు చేయబోమని ఆయా షాపులు యజమానులు స్పష్టంగా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. బాలలకు మత్తు ఔషధాల అమ్మకాలు చేస్తే apscpcr2018@gmail.comకు ఫిర్యాదు చేయాలని కోరారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ మత్తు ఔషధాలు వాడడం వల్ల పిల్లల జీవితాలు ఏవిధంగా ఛిద్రం అవుతాయో ప్రాథమిక విద్య నుంచే అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా ఔషధ నియంత్రణ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.చంద్రరావు, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.యుగంధరరావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా సభ్యులు గన్నెప్పడు, జిల్లా డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ అధ్యక్షులు కె.కరుణకుమార్ గుప్త, ప్రధాన కార్యదర్శి వి.మణిరాజు, ఔషధ దుకాణాల యజమానులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గొండు సీతారాం

కొవ్వాడ ప్రాజెక్టు ప్రత్యేక ఉప కలెక్టర్‌గా పద్మావతి

శ్రీకాకుళం : న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (కొవ్వాడ ప్రాజెక్టు) ప్రత్యేక ఉప కలెక్టర్‌గా బి.పద్మావతి నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.



స్టిక్కను ఆవిష్కరిస్తున్న ఆర్‌టిసి అధికారులు

ఇంటి ముంగిటకే సరుకు రవాణా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రజల ఇంటి ముంగిటకే ఆర్‌టిసి కల్పిస్తున్న సరుకు రవాణా సదుపాయాన్ని వినియోగించుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ కోరారు. నవంబరు 25వ తేదీ వరకు నిర్వహించే డోర్ డెలివరీ ప్రచార మహోత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం రెండో డిపో గ్యారేజీ ఆవరణలో డోర్ డెలివరీ స్టిక్కర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021లో డోర్ డెలివరీ విధానాన్ని ప్రారంభించామని, అప్పట్నుంచి ఇప్పటివరకు వినియోగదారులందరూ ఆదరించారన్నారు. మరింతగా ప్రజల్లోకి చేరువ కావాలని ఈనెల 26 నుంచి నవంబర్ 25 వరకు డోర్ డెలివరీ ప్రచార మహోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన 87 పట్టణాల్లో పది కిలోమీటర్ల పరిధిలో 50 కేజీల బరువు వరకు డోర్ డెలివరీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విజయనగరం ఎటిఎం కమర్షియల్ దివ్య, డిపో మేనేజర్-2 శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు, గ్యారేజ్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాలకు సోలార్ విద్యుత్ ప్యానల్స్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా యూనియన్ బ్యాంకు జిల్లాలో పది సచివాలయాలకు సోలార్ విద్యుత్ ప్యానల్స్‌ను అందజేసింది. ఈమేరకు కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబరులో యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ ఎం.వి.తిలక్ కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు సంబంధిత పత్రాలను శుక్రవారం అందజేశారు. సిఎస్ఆర్ ఆక్టివిటీలో భాగస్వామ్యమైన యూనియన్ బ్యాంకును అభినందించారు. రాబోయే కాలంలో మరిన్ని కార్యక్రమాల్లో పాలుపంచుకుని జిల్లా అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్యకిరణ్, యూనియన్ బ్యాంక్ కలెక్టరేట్ బ్రాంచ్ మేనేజర్ కె.తేజేశ్వరరావు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పత్రాలను అందజేస్తున్న యూనియన్ బ్యాంకు అధికారులు

మరిన్ని వార్తల కోసం www.prajasakti.com epaper.prajasakti.com

రైఫిల్ షూటింగ్ పోటీలకు చేతన్, రశ్మిత ఎంపిక

శ్రీకాకుళం : ఈనెల 29, 30 తేదీల్లో రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో తొమ్మిదో తరగతి చదువుతున్న న్యూసెంట్రల్ స్కూల్ విద్యార్థి శిష్టు లక్ష్మీచేతన్, ఇలిసిపురంలోని ఆర్‌సిఎం విద్యార్థి పి.రశ్మితకృష్ణ ఈ పోటీలకు హాజరు కానున్నారు. చిత్తరంజన్‌వీధిలోని మాతృదేవోభవ రైఫిల్ షూటింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులిద్దరూ ఈ పోటీలకు ఎంపిక కావడంపై శిక్షకుడు పి.తిరుమల హరీష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో రైఫిల్, పిస్టల్ షూటింగ్‌కు ఆదరణ కనిపిస్తోందని చెప్పారు. రైఫిల్ పోటీలకు వెళ్లనున్న చేతన్, రశ్మితను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి సాంబమూర్తి, ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శి బి.వి రమణ, న్యూ సెంట్రల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.మల్లేశ్వరరావు, డైరెక్టర్ పి.శ్రీకాంత్, షూటింగ్ కోచ్ రామ్మోహన్ తదితరులు అభినందనలు తెలిపారు.



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తి చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

పైడిభీమవరంలో నిర్మిస్తున్న ఇఎస్ఐ ఆరు పడకల ఆసుపత్రి నిర్మాణం సత్వరమే పూర్తిచేసి ప్రారంభించాలని, కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేసారు. పైడిభీమవరంలో నిర్మిస్తున్న ఇఎస్ఐ ఆరు పడకల డయాగ్నస్టిక్ సెంటర్ కమ్ డిస్పెన్సరీ నిర్మాణం సత్వరమే పూర్తిచేసి ప్రారంభించాలని, పైడిభీమవరంలో ఇఎస్ఐ లోకల్ పే ఆఫీసు ఏర్పాటు చేయాలని, ఇఎస్ఐ డిస్పెన్సరీల్లో రిఫరల్ సౌకర్యం కల్పించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇఎస్ఐ పథకాన్ని బలోపేతం చేసి కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో పైడిభీమవరంలో నిర్మాణంలో ఉన్న ఇఎస్ఐ ఆరు పడకల ఆసుపత్రి ముందు శుక్రవారం ధర్నా చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు ఆధ్వర్యంలో చేసిన పోరాటాలు ఫలితంగా పైడిభీమవరంలో స్థలం కేటాయించి రూ.6 కోట్లు నిధులు కేటాయింపులతో నిర్మిస్తున్న ఇఎస్ఐ ఆరు పడకల డయాగ్నస్టిక్ సెంటర్ నిర్మాణం చేపట్టి ఆరు సంవత్సరాలైనా నేటికీ పూర్తి చేయలేదన్నారు. డిస్పెన్సరీ, ప్యానెల్ క్లినిక్ లో రిఫరల్ సౌకర్యం ఎత్తివేయడం అంటే కార్మికులు వైద్యాన్ని దూరం చేయడమేనన్నారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు అనారోగ్యం వస్తే విశాఖపట్నం ఆరిలోవలో గల ఇఎస్ఐ ఆసుపత్రికి శ్రీకాకుళం నుండి వెళ్ళి రిఫరల్ రాయించుకోవాలంటే వ్యయ ప్రయాసలతో, తీవ్ర ఇబ్బందులతో కూడుకున్నదన్నారు. పైడిభీమవరం ఇఎస్ఐ డిస్పెన్సరీలో ఐదుగురు స్పెషలిస్టు డాక్టర్లను నియమించాలని, అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.నారాయణరావు, జె.గంగరాజు, శ్యాంక్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.అప్పలనర్సయ్య, డా.రెడ్డీస్ లేబొరేటరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.సురేష్, బి.రమేష్, అరబిందో ఫార్మా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.గురునాయుడు, నాయకులు రాంబాబు పాల్గొన్నారు.



పార్కును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

ముత్యాలమ్మ పార్కును అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి- పలాస

పలాస ముత్యాలమ్మ కోనేరు (నెహ్రూ పార్కు)ను అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస ముత్యాలమ్మ కోనేరు, కెటి రోడ్డు విస్తరణ పనులను శుక్రవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముత్యాలమ్మ కోనేరులో సమస్యలను గుర్తించి మొదటి ప్రాధాన్యతగా పనులు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వాకర్స్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పాడైన చిన్నారుల ఆట పరికరాలను బాగుచేయాలని సూచించారు. కెటి రోడ్డు విస్తరణ పనులు ఎంత వరకు వచ్చాయి, ఇంకా ఎంత శాతం పనులు చేయాల్సి ఉంది తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విస్తరణ పనులు ఆపకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈయనతో పాటు డిఇఇ సునీల్ కుమార్, ఎఇ అవినాష్, కాంట్రాక్టర్ మన్మథరావు, కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ కుమార్ ఉన్నారు.



మాట్లాడుతున్న సాయిరాజ్

సమిష్టి కృషితో చరిత్ర తిరగరాస్తాం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సమిష్టి కృషితో ఇచ్ఛాపురం నియోజకవర్గ చరిత్ర తిరగ రాస్తామని వైసిపి ఇన్‌ఛార్జి పిరియ సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం మున్సిపల్ కార్యలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇచ్ఛాపురంలో ప్రారంభించిన సామాజిక సాధికారిత యాత్ర బహిరంగ సభ అఖండ విజయం సాధించినందుకు కృషి చేసిన ప్రతి ఒక్క క్యాడర్‌కి కతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకూ సిఎం జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరుపై ప్రజలు ఇచ్చిన సంకేతం అన్నారు. ప్రతి గ్రామం నుంచి ప్రతి గడప నుండి ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేశారన్నారు. పార్టీ క్యాడర్ మొత్తం సమిష్టి కృషితో సమాయత్తం చెయ్యడంతో రానున్న ఎన్నికల్లో వైసిపి విజయానికి నిదర్శనమన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో కూడా పార్టీ క్యాడర్ కష్టపడితే ఖచ్చితంగా ఇచ్ఛాపురంలో వైసిపి జెండా ఎగుర వెయ్యడం తథ్యమన్నారు. ఈ సమావేశంలో పిఎసిఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర యాదవ్, ఎంపిపిలు కడియాల ప్రకాష్, నిమ్మన దాస్, దేవదాసు రెడ్డి ఎమ్మెల్యే అశోక్ తీరుపై మండిపడ్డారు. కేవలం ఉనికి చాటుకునేందుకు రాద్ధాంతం చేస్తారని విమర్శించారు. ఈసారి ఎన్నికల్లో అశోక్ ఆట పాటలు చెల్లవన్నారు. ఈ కార్యక్రమంలో సీడ్ ఎపి చైర్మన్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి, చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి , రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరావు, వైసిపి నేతలు లాభాల స్వర్ణమణి, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, ప్రకాశరావు పట్నాయక్, సాలీనా ఢిల్లీ, పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించాలి

కొత్తూరు : స్థానిక ఎబి ప్రధాన రహదారిపై మురుగునీటి సమస్య పరిష్కరించాలని శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో రిలేదీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు ఏడాది నుండి మురుగు నీరు, వర్షపునీరు రహదారిపై పారుతుండంతో వాహనదారులు, పాదచారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు విజృభించి స్థానికులు రోగాలు బారిన పడుతున్నారన్నారు. కొంతమంది పెద్దల అండదండలతో మూసివేసిన కల్వర్ట్ తెరచి సమస్య పరిష్కరించాలన్నారు. గతంలో టెక్కలి సబ్‌కలెక్టర్‌కు మెమోరాండం అందించామని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలన్నారు. సమస్య పరిష్కరించే వరకు ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ రిలేదీక్షకు అఖిల భారత న్యాయవాదుల సంఘం నాయకులు ఎం. అప్పారావు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వైశ్యరాజు నారాయణరాజు, శ్రీను, బోయిన చంద్ర భూషణ్, ఇస్పాయి సత్యనారాయణ, వాసు, భోగి లావణ్య, ప్రమీల కుమారి, జయ కుమారి, సుజాత, సాయి పాల్గొన్నారు.



రిలే దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న ప్రసాద్

నిధుల దుర్వినియోగంపై ఎంపిటిసిల నిలదీత

వాడివేడిగా మండల సమావేశం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఎంపిటిసిలు నిలదీశారు. శుక్రవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి ఆట్ల సరోజినమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి పాల్గొని మాట్లాడుతూ నాలుగు గోడల మధ్య జరగాల్సిన పంచాయతీని మండల సమావేశంలో నిలదీయడం సమంజసం కాదన్నారు. మండలంలో నిధులు ఎవరు ప్రమేయం లేకుండా ఎలా పనులు చేయించారని వాణి ప్రశ్నించడంతో ఎంపిపి, సీనియర్ అసిస్టెంట్ ఇచ్చిన జాబితా ప్రకారమే అంచనాలు వేసి పనులు చేయించానని మండల ఇంజనీర్ నాయుడు బదులిచ్చారు. ఇప్పటినుండి నా ప్రమేయం లేకుండా ఒక్క వర్క్ కూడా చేయడానికి వీలు లేదని ఆదేశించారు. ఏ ఒక్క ఎంపిటిసికి వివక్షత లేకుండా పనిచేస్తానని తెలిపారు. తొలుసూరుపల్లి, ధర్మనీలాపురం



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి దువ్వాడ వాణి

గ్రామాలకు 15 ఫైనాన్స్ నుండి 15 లక్షలు ప్రతిపాదన చేశానని, ఇంతవరకు ఆ పనులు ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. గతంలో కొన్ని పనులకు మంజూరు చేసామని, ఆ పనులు ఇంతవరకు చేయలేదని, రద్దు కూడా చేయలేదని, ఆ పనులు రద్దుచేసి ప్రతిపాదనలు చేస్తే పనులు చేయించడానికి వీలు పడుతుందని మండల ఇంజనీరు నాయుడు తెలిపారు. తేలినీలపురం గ్రామంలో రూ.5 లక్షలు పనులు మంజూరు చేస్తే రూ.2లక్షల50 వేలు బిల్లు చేశారని, మిగిలిన రూ.2 లక్షల 50 వేలు ఎవరిస్తారని వైస్ ఎంపిపి పేడాడ రమేష్ ప్రశ్నించారు. ప్రొసిడెంగ్ కాపీ రూ.2లక్షల 50వేలుకు ఇచ్చి రూ. 5 లక్షలు ఎలా బిల్లు చేస్తానని నాయుడు తెలిపారు. మండలంలో వరి పంట పూర్తిగా ఎండిపోతుందని వర్షం లేక కొంత పంట, వంశధార నీరురాక మరికొంత ఎండిపోయిందని సభ్యులు ప్రశ్నించారు. ఇరిగేషన్ లిఫ్టులకు విద్యుత్ తొలగించడంతో పనిచేయడం లేదని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమస్య పరిష్కారం చేయకపోతే పరిస్థితి తీవ్రతరంగా ఉంటుందని విద్యుత్ ఎఇ తమ్మినేని ఈశ్వరరావును సభ్యులు నిలదీశారు. ఎస్ఇతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. వంశధార టెక్కలి నియోజవర్గం మీదగా పలాస వెళ్తుందని టెక్కల్లో ఎందుకు నీరు ఇవ్వడం లేదని వంశధార అధికారులను ప్రశ్నించారు. వంశధార జెఇ కె.శివాజీ మాట్లాడుతూ వర్షం లేక వంశధార నీరు రావడం తక్కువ ఉండడంతో సర్దుబాటు చేయాల్సి వస్తుందని వస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయి, పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం, వైస్ ఎంపిపి మున్నెల కిషోర్, ఎంపిటిసిలు కూన పార్వతి, సత్తారు ఉషా, పీత హేమలత, వాకాడ శ్రీధర్ రెడ్డి, ప్రత్యేక అహ్వానీతలు ఎన్.శంకరరావు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు అవకాశం

ప్రజాశక్తి- టెక్కలి

రానున్న ఎన్నికల్లో ఓటర్‌గా పేరు నమోదు చేసుకోవాలనుకునే వారు ఆన్‌లైన్ ద్వారా గానీ, బిఎల్ఒల ద్వారా గానీ అర్హులైన వారు తమ పేర్లు నమోదు చేసుకునే ఆవకాశం కల్పిస్తున్నామని సబ్‌కలెక్టర్ నూరల్ కమర్ తెలిపారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎన్నికల ముసాయిదా పబ్లిష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి డిసెంబర్ 9లోగా ఓటర్లు తమ పేర్లు నమోదు చేసుకోవచ్చునన్నారు. ఇప్పటి వరకు ఉన్న ఓటర్లు జాబితాలో చేపట్టిన సవరణల మేరకు టెక్కలి నియోజకవర్గం పరిధిలో ఉన్న 315 పోలింగ్ స్టేషన్ల పరిధిలోఉన్న బిఎల్ఒల వద్ద జాబితా ఉందన్నారు. ఏమైనా చేర్పులు మార్పులు ఉంటే సవరించుకోవచ్చునన్నారు. ఓటర్లు నమోదు ప్రక్రియపై ఆయా రాజకీయ పార్టీలకి చెందిన నాయకులు పరిశీలించుకోవచ్చునని సబ్‌కలెక్టర్ కమర్ తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, వైసిపి నాయకులు ఆట్ల రాహుల్ కుమార్ పాల్గొన్నారు.

పలాస: 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరు ఓటుహక్కు కలిగి ఉండాలని, ఎన్నికల కమిషన్ అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తుందని, దీనిని వినియోగించుకోవాలని ఆర్‌డిఒ భరత్ నాయక్ అన్నారు. శుక్రవారం ఓటర్ల జాబితా విడుదల సందర్భంగా తహశీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి నవంబరు 9వ తేదీ వరకు ఓటర్ల చేర్పులు, మార్పులతో పాటు కొత్త ఓటరును నమోదు చేసుకోవాలని, ఈ ప్రక్రియ ప్రతి సచివాలయం పరిధిలో ఉందని తెలిపారు. అలాగే పోలింగ్ స్టేషన్ మార్పులు, ఫారం-6, 7 ద్వారా మార్చుకోవచ్చని, తుది జాబితా జనవరి 1వ తేదీ 2024లో విడుదల చేస్తామన్నారు. పొరపాటున బూత్‌ల వారిగా తొలగించిన ఓట్లను వచ్చే నెల 9వ తేదీలోగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా కూడా ఓటు నమోదు చేసుకోవచ్చని, ఈ సౌలభ్యం కేంద్ర ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ఓటరు జాబితాలో రెండు ప్రాంతాల్లో ఓట్లు కలిగిన ఓటరు తన అభిప్రాయం మేరకే ఒకే చోట ఉండేందుకు అస్కారముందని, ఫారం-8 ద్వారా మిగిలిన ఓటును తొలగిస్తామన్నారు. పలాస నియోజకవర్గంలో 284 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, అలాగే 2, 12,252 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 10.61 మంది, స్త్రీలు 1,08,055 మంది, ట్రాన్స్ జండర్స్ 35 మంది ఉన్నారని తెలిపారు. సమావేశంలో ఎన్నికల డిటి రాంబాబు, పలాస, మందస, వజ్రపుకొత్తూరు తహశీల్దార్లు మధుసూధనరావు, పాపారావు, అప్పలస్వామి పాల్గొన్నారు. అంతకు ముందు వివిధ పార్టీల నాయకులతో ఓటర్ల జాబితా సవరణలపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు డబ్బీరు భవానీ శంకర్, పి.విఠల్, బడ్డ నాగరాజు, సూరాడ మోహనరావు, కోన క్రిష్ణారావు, శ్యామసుందర్, తంగుడు వీర్రాజులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు వుంటే 27 నుండి డిసెంబర్ 9 లోపు సరిచేసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 309 పోలింగ్ కేంద్రాలకు సుమారు 2 లక్షల 40వేలు ఓటర్లు ఉన్నారని తెలిపారు. డిసెంబర్ 9 వరకు ఫారం 6, 7, 8 దరఖాస్తు చేసికోవాలన్నారు. ఈ ప్రక్రియలో ప్రతి ఓటర్ తనకు గల ఓటర్ కార్డు వివరాలు తెలుసుకోవచ్చని, ఓటర్



టెక్కలి : మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

కార్డులో వ్యక్తిగత వివరాలు, ఫోటో మార్పులు, కుటంబ సభ్యులు అందరు ఓటర్ల జాబితాలో ఒక్క దగ్గరకి అనుసంధానం చేయటం జరుగుతుందన్నారు. మంచి ఓటరు జాబితా తయారీకి ఓటర్లు సహకారం ఎంతైనా ఉందన్నారు. దానికోసం ప్రతీ ఒక్క ఓటరు సహకరించాలన్నారు. ప్రతి సోమవారం పోలింగ్ కేంద్రం వద్ద నిర్వహించనున్న సమావేశంలో కొత్తగా ఓటర్‌కు ఫారం-6 వివరాలు, ఓటర్ జాబితాలో తొలిగించుటకు ఫారం-7 వివరాలు, సవరణ కోసం ఫారం-8 వివరాలు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ఓటర్లలకు తెలియచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సనపల కిరణ్‌కుమార్, ఎలక్షన్ డిటి శ్రీనివాసరావు ఉన్నారు.

కొత్తూరు: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిటి సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం జరిగిన అఖిలపక్షం, బిఎల్ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటర్ల జాబితాను బిఎల్ఒలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామసభ నిర్వహించి ఓటర్ల జాబితాను చదివి వినిపించాలన్నారు. అలాగే సచివాలయాల వద్ద జాబితాను వేలాడదీయాలన్నారు. జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే డిసెంబర్ 9లోగా తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో అఖిలపక్షం నాయకులు గండివలస ఆనందరావు, గండివలస తేజేశ్వరరావు, కష్ణ మోహన్, పంకజ్ దాస్, బిఎల్ఒలు పాల్గొన్నారు.

శీతల కొండలో ఏం జరుగుతోంది?

ప్రజాశక్తి- కవిటి

శిలగాం గ్రామ శివారులో ప్రతీరోజూ బాంబుల మోత, నిరంతరం వాహనాల రద్దీ, కమ్మేస్తున్న దూలి, దుమ్ముతో వేలమంది జనాభా బాధపడుతున్నారని, మండలంలో ఏ అధికారి, ప్రజా ప్రతినిధికి తెలియకుండా ఆ కొండలో ఏం జరుగుతోందని మండల వైస్ ఎంపిపి పూడి నేతాజీ ప్రశ్నించారు. మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం సాయంత్రం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతలకొండలో జరుపుతున్న తవ్వకాలతో శిలగాం, బెలగామ్, కరాపాడు, కొజ్జిరియా, లండారిపుట్టుగ తదితర పంచాయతీల్లోని పదులసంఖ్యలో గ్రామాలు కాలుష్యంతో నిండిపోతున్నాయని, నిరంతరం ఆ కొండలో జరుగుతున్న పేలుళ్లతో స్థానికులు హడలిపోతున్నారన్నారు. అంతేకాకుండా ఉద్దానంలోని పచ్చనిప్రకృతి ఈ పేలుళ్లతో వస్తున్న కాలుష్యం ద్వారా మసకబారుతోందని, నీరు కూడా కలుషితమవుతోందని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఇంత జరుగుతున్నా ఆ కొండలో ఏం చేస్తున్నారు, ఎవరు అనుమతులు ఇచ్చారనేది మండల అధికారులకు, ముఖ్య నాయకులకు తెలియకపోవడం శోచనీయమన్నారు. పేలుళ్లతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, పర్యావరణానికి జరుగుతున్న హానిని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. అదే విధంగా ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందించి కవిటి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం కోసం మండల పరిషత్ నిధులు మంజూరు చేస్తూ తీర్మానం చేయాలని సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎంపిటిసి పూడి నీలాచలం సూచించారు. అలాగే శిథిలావస్థలో ఉన్న తుఫాన్ బిల్డింగ్, పాత ఒడియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలు నేలమట్టం చేస్తే అదే స్థలంలో మళ్లీ అవసరమైన ప్రభుత్వ భవనాలు నిర్మించేందుకు అనువుగా ఉంటుందని, రెవెన్యూ అధికారులు దీనిపై దృష్టిసారించాలని కోరారు. అనంతరం రెవెన్యూ, విద్యుత్, ఉద్యానవన, వైద్య, పశ, ఎన్ఆర్ఇజిఎస్, ఎక్సైజ్ అధికారులు తమ శాఖల ప్రగతి వివరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ రామారావు, సీడాప్ చైర్మన్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి, ఎంపిపి కడియాల పద్మ, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి, డిటి రామచంద్రరావు, ఎఇ శ్రీనివాస రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



ప్రహరీ నిర్మించాలని సూచిస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలి

ఆమదాలవలస: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఆపాలని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పట్టణంలో జనసేన కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని, కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం తక్షణమే చేపట్టాలని కోరుతూ నవంబర్ 8న విద్యాసంస్థల రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయా లని కోరారు. సిటిజన్ ఫోరం నాయకుడు బొడ్డేపల్లి మోహనరావు, టిడిపి నాయకులు బోర గోవిందరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, జనసేన నాయకులు పైడి మురళీమోహన్‌లు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 32 మంది విశాఖ ఉక్కు, ఆంధ్రులహక్కు అన్న నినాదంతో జరిగిన ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయారన్నారు. బలిదానాలకు, విలు వివ్వకుండా మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల కోసం స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు సింహాచలం ఉన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

బూర్జ: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మద్దతు ధరపై రైతుల పండించిన పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె. శ్రీధర్ తెలిపారు. శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలం పాలవలస గ్రామంలో రైతుభరోసా కేంద్రంలో నిర్వహించిన పొలంబడి గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ 2023 సీజన్‌కు సంబంధించి ఇ క్రాప్ ఇకెవైసి ప్రక్రియ దాదాపు పూర్తయిందని, ఆ వివరాలను సామాజిక తనిఖీ కొరకు రైతు భరోసా కేంద్రంలో ఈ నెల 29వ తేదీ నుండి ప్రదర్శించి నమోదులు, అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందన్నారు. మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల్లో నవంబర్ 10 నుండి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పొలంబడి కార్యక్రమానికి రామన్నపేట, పాలవలస, జంగాలపాడు, అడ్దారిపేటలో సేంద్రీయ పద్ధతుల్లో 55 మంది రైతులను ఎంపిక చేసి వారికి 14



పొలంబడి కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జెడి శ్రీధర్

వారాల పాటు మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామసభ అనంతరం పనస తవిటినాయుడు క్షేత్రాన్ని అధికారుల బృందం సందర్శించారు. గ్రామ సర్పంచ్ జల్లు అంబుజాక్షి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హార్టీకల్చర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ భగవాన్, శ్రీకాకుళం రైతు శిక్షణా కేంద్రం ఎడిఎ వెంకటరావు, ఎఒ సూర్యకుమారి, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, నాయకులు కర్నెన నాగేశ్వరరావు, సవర సురేష్, మండల వ్యవసాయ అధికారి వి.రాజేశ్వరావు, కొత్తూరు ఎడిఎ రాజగోపాలరావు, విఎఎస్ హేమలత, పోలరాజు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- బూర్జ



వెంకటేష్ (ఫైల్)

మండలంలోని చీడివలస గ్రామానికి చెందిన పోలాకి వెంకటేష్(19) కడుపునొప్పి తాళలేక గడ్డి మందు తాగి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం మృతుడు వెంకటేష్ తీవ్రంగా వస్తున్న కడుపునొప్పిని తట్టుకోలేక గడ్డి మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. తన అన్నయ్య రాము వెంకటేష్ మధ్య ఘర్షణ జరిగిందని, కుటుంబ కలహాల వలన ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానికులు చెప్తున్నారు. అమ్మమ్మ ధర్మవరపు సన్యాసమ్మ అన్నదమ్ములిద్దరిని పోషిస్తుందని తెలిపారు. మృతుడు వెంకటేష్, అన్నయ్య రాము ఇద్దరి మధ్య వారంరోజుల నుంచి ఘర్షణ జరుగుతుందంటున్నారు. వెంకటేష్‌ను వెంటనే పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరిస్థితి విషమించిందని శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం వేకువ జామున 3 గంటల సమయంలో మరణించాడు. ఎఎస్ఐ సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో ఇంజినీరింగ్ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని అల్లెన గ్రామానికి చెందిన గేదెల నారాయణరావు కుమారుడు గేదెల సుధీర్(25) శుక్రవారం మృతిచెందాడు. ఆరు నెలల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో అస్సాంలో వుంటు న్నాడు. అయితే రెండు నెలల క్రితం అనారోగ్యం రావడంతో వైద్యులను సంప్రదించిగా బ్రెయిన్‌ట్యూమర్ అని చెప్పారని తండ్రి నారాయణ రావు తెలిపారు. అందుకు శస్త్ర చికిత్స కూడా జరిగిందన్నారు. తమకు రాకపోకలకు ఇబ్బందిగా ఉందని వైజాగ్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో జాయిన్ చేశామని తండ్రి నారాయణరావు తెలిపారు. అయినప్పటికీ పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం కెజిహెచ్‌లో సుధీర్ మృతి చెందాడని నారాయణరావు తెలిపారు



సుధీర్ (ఫైల్)

అల్లెనలో విషాదం...

సుధీర్ మృతి చెందాడని తెలియడంతో అల్లెన గ్రామంలో విషాదం నెలకొంది. కష్టపడి చదివి ఉద్యోగం సంపాదించిన సుధీర్ అకాల మరణం చెందుతాడని ఊహించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సుధీర్ ఇటీవల ఉద్యోగంలో చేరాడు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుగా విలపించారు.

గాయపడిన యువకుడు మృతి

లావేరు: మండలం జాతీయ రహదారి తాళ్లవలస వననర్సరీ సమీపంలో గురువారం ఉదయం ద్విచక్ర వాహనం అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న క్రాస్ బెరియర్స్ ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సవర రామారావు (22) విశాఖపట్నం కేజిహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం, చాపరాయిగూడ గ్రామానికి చెందిన సవర రామారావు తన ద్విచక్ర వాహనంతో విశాఖపట్నంలో విధులు నిర్వహించేందుకు వెళ్లుతున్న సమయంలో తాళ్లవలస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయాలు తగలడంతో తీవ్రంగా పడ్డాడు. గాయపడిన వ్యక్తిని శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. రామారావు పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులు అప్పగించడం జరిగిందన్నారు. రామారావుకు భార్య బుజ్జమ్మ, నాలుగు నెలల పాప ఉంది. రామారావు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీమున్నీరుగా విలపిస్తున్నారు.

యువకునికి గాయాలు

పలాస: పలాస రైల్వే స్టేషన్‌లో వజ్రపుకొత్తూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన మరడ పాపారావు శుక్రవారం రాత్రి రాజారాణి ఎక్స్‌ప్రెస్ ఎక్కుతుండగా జారిపడి గాయపడ్డాడు. పలాస నుంచి భువనేశ్వర్ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఘటన జరిగిన వెంటనే 108 సిబ్బంది సత్యం, వెంకటరావు ప్రథమ చికిత్స అందించి పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



క్షతగాత్రునికి వైద్య సేవలు అందిస్తున్న 108 సిబ్బంది



మాట్లాడుతున్న గోవిందరావు

ప్రజా రక్షణ భేరిని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- సోంపేట

సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా రక్షణ భేరి బస్సుయాత్ర నవంబర్ 2న మందసలో ప్రారంభించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ బస్సు యాత్రను సిపిఎం పార్టీ అఖిల భారత నాయకులు కామ్రేడ్ విజ్జు కష్ణ ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎస్ లక్ష్మీనారాయణ, సిపిఎం నాయకులు పాతిని కృష్ణమూర్తి, దున్న హేమయ్య, కె.గోపీనాథ్, జుత్తు సింహాచలం, తెప్పల పాపారావు, కృష్ణ, రఘు, డక్కర కామయ్య, సింహాచలం పాల్గొన్నారు.

తప్పులను సవరించుకోవాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

పంట నమోదులో ఏవైనా తప్పులు ఉంటే సవరించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయభాస్కర్ అన్నారు. సామాజిక తనిఖీలో భాగంగా శుక్రవారం మండలంలోని అర్జునవలస రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ 2023 పంట నమోదు చేసిన వివరాలన్ని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించడం జరిగిందన్నారు. అదేవిధంగా గ్రామసభ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ నెల 29 లోపు గ్రీవెన్స్ ఉంటే ధరకాస్తు చేస్తే సరిచేయడం జరుగుతుందన్నారు. పంట నమోదు కానివారికి పంట అమ్ముకోవటం, ఇన్సూరెన్స్ వంటివి వర్తించవని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి మీసాల రామునాయుడు, వేల్పురాయి సర్పంచ్ బాలి శ్రీను, రైతులు పాల్గొన్నారు.



కొత్తగా అమర్చిన కుళాయి

కుళాయి మార్చారు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

కవిటి : 'తాగునీరు వృథా' అంటూ గురువారం ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. కవిటి మండలం కపాసుకుద్ది గ్రామంలోని కొత్తవీధిలో బడే గోవిందమ్మ ఇంటి ఎదురుగా ఉన్న ఉద్దానం మంచినీటి పైపు 20 రోజుల క్రితమే పాడై తాగునీరు వృథాగా పోతోందని గ్రామస్తులు సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదంటూ ప్రజాశక్తి వార్త ప్రచురించింది. దీంతో గ్రామానికి చేరుకున్న ఉద్దానం మంచినీటి పథకం సిబ్బంది పాడైన పైప్‌లైన్ మార్చి కొత్త కుళాయిని అమర్చారు. దీనిపై స్థానికులు ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలిపారు.



శిలగాం-కవిటి రోడ్డులో చేపట్టిన పనులు

తుప్పలు తొలగించారు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

దారులు.. మూసుకుపోతున్నాయి శీర్షికన ప్రజాశక్తిలో ఈనెల 25న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మొదటి విడతగా రెండు రోజులు నుంచి శిలగాం నుంచి కవిటి వచ్చే రహదారికి ఇరువైపులా ఉన్న ముల్లపొదలు, చెట్లు తొలగిస్తున్నారు. ఆర్అండ్‌బి జెఇ మోహనరావు దగ్గరుండి పనులు పర్యవేక్షిస్తున్నారు. అయితే మండలం మొత్తం జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కానీ గతంలో చేసిన పనులకే ఇప్పటికీ బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు జంగిల్ క్లియరెన్స్ పనులు చేసేందుకు ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది.

క్వారీ లీజుకు ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి- పొందూరు

మండలం లోలుగు పంచాయతీ పరిధిలో సర్వేనెంబర్-33లో క్వార్ట్జైట్ క్వారీ తవ్వకాల లీజుకు శుక్రవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణను అధికారులు చేపట్టారు. లోలుగులో సర్వేనెంబర్ 33లో 20 హెక్టార్ల పరిధిలో తవ్వకాలు చేపట్టేందుకు లీజు కోరుతూ గ్రామానికి చెందిన లోలుగు అనూరాధ ధరఖాస్తు చేసుకున్నారు. దీంతో క్వారీ నిర్వాహణకు ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన నిబంధనల మేరకు కార్యచరణ చేపట్టారు. దీంతో లోలుగు, పుల్లాజీపేట, నందివాడ, బురిడికంచరాం గ్రామాలకు చెందిన ప్రజల నుంచి ప్రజాభిప్రాయాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి, కాలుష్య నియంత్రణా మండల ఇఇ ఎ.రామారావునాయుడు పాల్గొన్నారు.

ఆడిట్‌లో రికవరీలు చెల్లించాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జరిగిన సామాజిక తనిఖీలలో వచ్చిన రికవరీలను వెంటనే చెల్లించాలని జిల్లా విజిలెన్స్ అధికారి బి. లవరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఉపాధిహామీ పథకం కార్యాలయానికి అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సామాజిక తనిఖీల్లో చెల్లించాల్సిన రికవరీలను వెంటనే చెల్లించాలని లేకుంటే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. అలాగే మండలంలో రూఫ్‌టాప్‌హార్‌వెస్టింగ్ స్ట్రెక్చర్స్ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా సూపరెండెంట్ ఫణీగ్రహి, జిఇ జి. హరిప్రసాద్, క్లస్టర్ టిఎ రాంబాబు, పి. నర్సింహామూర్తి, సాంకేతిక సహాయకులు ఉన్నారు.

ఈ-క్రాప్‌పై గ్రామసభ

నందిగాం: మండలంలోని దిమిలాడ రైతు భరోసా కేంద్రంలో ఇ క్రాప్ నమోదుపై గ్రామసభ శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎడిఎ తిరుమల రావు మాట్లాడుతూ ఇక్రాప్ నమోదు జాబితాలు ప్రచురించారు. ఎటువంటి అభ్యంత రాలున్నా ఈనెల 29లోగా తెలి యజేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్రీకాంత్ వర్మ, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు బి మధుసూదనరావు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

మహిళల అభ్యున్నతి కోసం కృషి

ప్రజాశక్తి- పలాస

మహిళల అభ్యున్నతికి వైసిపి ప్రభుత్వం కృషి చేస్తుందని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. శుక్రవారం పలాస కాశీబుగ్గ మున్సిపల్ మెప్మా ఆధ్వర్యంలో ఆర్‌పిలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రభుత్వం మహిళా సాధికారిత కోసం కృషి చేస్తుందని, ప్రతి మహిళ ఆర్థికంగా ఎదిగేందుకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని, ప్రజాసాధికారిత యాత్ర ప్రభుత్వం చేపడుతుందని, దానిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐ.బి.రాము, సిఎంఎం మోహన్, భాస్కరరావు, సిఒలు స్వప్న, పద్మ, కవిత, ఆర్‌పిలు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి

డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో నాడు-నేడు ద్వారా చేపట్టిన పనులను వేగవంతం చేయాలని డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ విద్యాసాగర్ ఆదేశించారు. శుక్రవారం పోలాకి కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల్లో రూ. కోటి 14 లక్షలతో చేపట్టిన నాడు-నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నాణ్యత, గదులునిర్మాణం, మరుగుదొడ్ల నిర్మానాలు, టైల్స్, వాటర్ సౌకర్యాలు తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. పనులు నిర్వహణలో జాప్యం లేకుండా, నాన్యతలో రాజీ పడకుండా వేగవంతం చేయాలని గుత్తేదారులకు సూచించారు. ఈయన వెంట ఎపిఎం రాజారావు, ఎఇ రామానందం, ఎంఇఒ లింగరాజు, హెచ్ఎం ఆర్. లక్ష్మీ, గుత్తేదారు కరిమి శ్రీను, సిబ్బంది ఉన్నారు.



మైకార్‌తో జతకట్టిన టర్టిల్ వాక్స్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

టర్టిల్ వాక్స్ ఇంక్ అవార్డు గెలుచుకున్న చికాగోకు చెందిన కార్ కేర్ కంపెనీ, శ్రీ వెంటేశ్వరాస్ వాక్స్ మై కార్ భాగస్వామ్యంతో శ్రీకాకుళంలో మరో కో-బ్రాండెడ్ కార్-కేర్ స్టూడియోను శుక్రవారం ప్రారంభించింది. పెద్దపాడు రోడ్, వీరన్న షెడ్ దగ్గర అల్ట్రా-ఆధునిక ట్యూట్లి వ్యాక్స్ డిటైలింగ్ టెక్నాలజీలు అధిక అర్హత కలిగిన, శిక్షణ పొందిన సేవా సిబ్బందితో ట్యూట్లి వ్యాక్స్ కార్ కేర్ స్టూడియో కార్ ప్రారంభించారు. ఈ విషయమై టర్టిల్ వాక్స్ కార్ కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సాజన్ మురళి వురవంగర మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుండి కార్ కేర్ పట్ల పెరుగుతున్న ఆసక్తిని గమనించామని, శ్రీకాకుళంలో మరొక కార్ కేర్ స్టూడియోను ప్రారంభించాలని నిర్ణయించుకున్నామన్నారు. ఈ సరికొత్త స్టూడియోతో రాష్ట్రవ్యాప్తంగా అత్యుత్తమ ప్రీమియం, నాణ్యత గల కారు డిటైలింగ్ సర్వీస్‌ను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రాబోయే సంవత్సరాల్లో దానిని బలోపేతం చేయడం కొనసాగిస్తామన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- పొందూరు

మండలం లోలుగు ప్రాథమిక పాఠశాలలో విశాఖపట్నం గిరిజన కార్పోరేషన్ ఎడి గేదెల సురేష్, మాధురి దంపతులు శుక్రవారం తమ కుమారుడు పవన్‌చేతన్ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు విద్యాసామాగ్రి కిట్లును పంపిణీ చేశారు. పాఠశాలలోని ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు గల విద్యార్థులకు పలకలు, అట్టలు, పెన్సిల్ బాక్స్, నోట్‌బుక్‌లతో పాటు స్వీట్లును పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తానుకూడా ఈ పాఠశాల పూర్వపు విద్యార్థినేని, మీరంతా బాగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, సర్పంచ్ ధనలక్ష్మి, ఎంపిటిసి లక్ష్మంనాయుడు, ఎంఇఒలు పి.వి.రామరాజు, పి.రాజారావు, ప్రధానోపాధ్యాయులు సిహెచ్.విజయబాల, పిఎసిఎస్ చైర్మన్ తిరుపతిరావు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే ప్రభుత్వ లక్ష్యం


ప్రజలతో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా రూపొందించడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలం గోకర్ణపల్లిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు చేపడుతున్న వైద్యపరీక్షలను, వారికి ఇస్తున్న మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 350 మందికి వైద్య పరీక్షలను జరిపి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతాడ మాధురి, ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకట కృష్ణారావు, సర్పంచ్ ప్రతినిధి చింతాడ సత్యప్రసాద్, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఇఒపిఆర్‌డి సింహాచలం, వైద్యాధికారులు జి.రమేష్‌నాయుడు, పి.శివశంకర్, కె.వి.మేఘా, శ్రీలేఖ, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలాకి: కోడూరు సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌ఎ ధర్మాన కృష్ణదాస్ పాల్గొన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, వైసిపి నాయకులు చింతాడ ఉమా, చింతాడ వెంకటరావు, కణితి సత్తిబాబు, ఆర్.త్రినాథరావు, డిటి శ్రీనివాసరావు, ఎంపిసొ ఉషశ్రీ, వైద్యులు శ్రీనాథ్, రత్నరాజు, పి.చందన్, సచివాలయం సిబ్బంది ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లావేరు: లావేరు పంచాయతీ లావేటిపాళెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, ఎంపిడిఒ సురేష్ కుమార్, మాజీ ఎంపిపి రాజినాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసురావు, సర్పంచ్ ఉర్లాపు లక్ష్మి, వైద్యాదికారులు మణిభూషన్, జగదీష్, ఎంపిటిసి సతీష్, డొకల రాధ, నాయకులు లంకలపల్లి గోపి, పైడి దాము పాల్గొన్నారు

కవిటి: మండలం నెలవంక పంచాయతీలో శుక్రవారం జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి శేఖర్, ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి, ఎఎంసి చైర్మన్ దువ్వ కృష్ణారెడ్డి, సర్పంచ్ దుర్గాసి గౌతమి, కుమార్ మోహన్ రెడ్డి, ఎంపిటిసి ప్రతినిధి చిన్నారెడ్డి, ఇందు శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్


సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

వజ్రపు కొత్తూరు: పెద్దబొడ్డపాడు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, సర్పంచ్‌లు తమ్మినాన ఢిల్లీరావు, కొల్లి భాస్కరరావు, ఎంపిటిసి ఉరిటి కామేశ్వరరావు, మాజీ ఎంపిటిసి ఇప్పిలి అప్పన్న, తహశీల్దార్ బి.అప్పలస్వామి, వైద్యాధికారి కనిష్క, కార్యదర్శిలు ఈశ్వరరావు, దామోదర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

నందిగాం: మండలం కొత్త అగ్రహారం, బడగాం సర్పంచ్‌లు కింతల శేషగిరి, కూన శాంతారావు ఆధ్వర్యంలో నిర్వహించిన జనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపిడిఒ శివప్రసాద్, ఎంపిటిసి అంబోడి విష్ణు, సర్పంచ్‌లు బొమ్మాళి గున్నయ్య, సంబాన దానయ్య, వైసిపి నాయకులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు, సెక్రెటరీ, వలంటీర్లు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యాశాఖాధికారులు

సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి

జనవిజ్ఞాన వేదిక ఆద్వర్యంలో నవంబర్ పదవతేదీ నుంచి నిర్వహించనున్న సైన్స్ చెకుముఖి సంబరాలు ప్రారంభం కానున్నాయని జిల్లా ఆధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికను శుక్రవారం మండల రిసోర్సు కార్యాలయం వద్ద విద్యాశాఖాధికారులు దల్లి తులసిరావురెడ్డి, దాసుపురం చిన్నారావులుచే గోడపత్రికను ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో జెవివి నాయకులు పాలవలస ధర్మారావు, సాంస్కృతిక విభాగం కన్వీనర్ తమ్మినేని వైకుంఠరావు, యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి కురమాన దాలయ్య, మండల రిసోర్సు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఢిల్లీకి మేరా మట్టి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నాదేశం.. నామట్టి కార్యక్రమంలో భాగంగా మండలంలో 38 పంచాయతీల నుంచి సేకరించిన మట్టిని శుక్రవారం స్థానిక ఎంపిడిఒ ఫణీంద్రకుమార్ చేతులు మీదుగా ఎత్తురాళ్లపాడు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఎన్.షణ్ముఖరావు మట్టి కుండను పట్టుకొని ఢిల్లీకి పయనమయ్యాడు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఎపిఒ, జెఇ హరిప్రసాద్ ఉన్నారు.

దళితుల భూముల జోలికొస్తే సహించేది లేదు

ప్రజాశక్తి- బూర్జ

దళితుల భూముల జోలికి వస్తే సహించేది లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగారపు సింహాచలం హెచ్చరించారు. శుక్రవారం నాడు మండలంలోని అన్నంపేట పంచాయతీ పరిధిలోని తిమడం గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. 40 ఏళ్లుగా దళితుల సాగులో ఉన్న అసైన్డ్ భూములు నేడు మాజీ సైనిక అధికారి పేరున రికార్డులు ఎలా మార్చారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.1984 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం 11 మంది దళితులకు సుమారు పది ఎకరాల భూమిని ఢీ పట్టాలిచ్చి భూమిని అప్పజెప్పినట్లు తెలిపారు. పట్టాలిచ్చి అప్పజెప్పిన భూమి నేటికీ దళితులే సాగు చేసుకుని అనుభవిస్తున్నారని స్వయంగా భూములను పరిశీలించామన్నారు. ప్రభుత్వం డ్రోన్ ద్వారా రీ సర్వే చేస్తున్న సందర్భంలో ఆ భూములు మాజీ సైనిక ఉద్యోగి అయిన విరోధులు సూర్యనారాయణకు సైనికులు కోటాలో ఇచ్చినట్లు రికార్డుల్లో చూపిస్తున్నట్లు దళితులు చెప్పారు. మాజీ సైనికు ఉద్యోగి ఒక రోజైనా ఆ భూమిపై బాగు చేసి వ్యవసాయం చేసినట్లు ఆధారాలు లేవని, 40 సంవత్సరాల నుండి దళితుల సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని వారన్నారు. వెంటనే రీ సర్వే జరిపి దళితులకు అన్ని హక్కులు కల్పించి మాజీ సైనిక ఉద్యోగి నుండి రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కౌల రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భవిరి కష్ణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అప్పలనాయుడు, నాయకమ్మ, రాజు, స్థానిక దళితులు కల్లేపల్లి రమణమూర్తి, జర్జన శ్రీరాములు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సింహాచలం

బలవర్థక ఆహారంతో బాలల ఆరోగ్యం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

బలవర్ధకమైన ఆహారం అందించడం ద్వారా బాలలు ఆరోగ్యవంతంగా ఉంటారని తహశీల్దార్ బి.అప్పలస్వామి అన్నారు. శుక్రవారం పెద్దబొడ్డపాడు సచివాలయం వద్ద ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, సర్పంచ్ తమ్మినేని ఢిల్లీరావుతో కలిసి స్టాల్‌లో ఉంచిన ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అవసరమన్నారు. రుచికరమైన ఆహారం గర్భిణీలు, బాలింతలకు అందుతుందన్నారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు వలన పిల్లల్లో పోషక విలువలు పెరుగుతాయన్నారు. నాడు-నేడు కింద పాఠశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన జరుగుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాలు ద్వారా అందిస్తున్న సమతుల్య ఆహారం క్రమం తప్పకుండా తీసుకుంటే రక్తహీనత సమస్యలు భవిష్యత్తులో తలెత్తవు అన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించే బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తమ్మినాన ఢిల్లీరావు, కొల్లి భాస్కరరావు, ఎంపిటిసి ఉరిటి కామేశ్వరరావు, మాజీ ఎంపిటిసి అప్పన్న, కార్యదర్శి ఈశ్వరరావు, ఐసిడిఎస్ సూపర్ వైజర్ గంగమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు హెచ్.చంద్రావతి, బమ్మిడి భాగ్యవతి, లండ మౌనిక, పద్మావతి, లత, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

పోలీసుల త్యాగం వెలకట్టలేనిది

ప్రజాశక్తి- నరసన్నపేట

పోలీసుల త్యాగం వెలకట్టలేనిదని ఎస్ఐ వై. సింహాచలం అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో గురువారం పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 62 సంవత్సరాల క్రితం భారత సరిహద్దుల్లో అక్షయ చిన్ ప్రాంతంలో పహారా కాస్తున్న మన పోలీసు దళాలపై పెద్ద మొత్తంలో చైనీయులు దొంగచాటున దాడి చేయగా మన వారు విరోచితంగా పోరాడి చివరికి వీరమరణం పొందారన్నారు. అలా వీరమరణం పొందిన పోలీసుల త్యాగాలను స్మరిస్తూ ప్రతిఏటా అక్టోబర్ 21న దేశ వ్యాప్తంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్, అధ్యాపకులు, కానిస్టేబుల్ మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ సింహాచలం

పలాస: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం పలాస రైల్వే పోలీసు ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరులైన పోలీసు సిబ్బందిని స్మరించుకుంటూ వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా వలాస మేధా ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీసుల పని తీరు, రికార్డులు జిఆర్‌పి ఎస్‌హెచ్ఒ హెచ్.కె షరీఫ్ అవగాహన కలిగించారు. కార్యక్రమంలో హెచ్‌సి కోదండరావు, కానిస్టేబుళ్లు మురళీ, శ్రీను, దేవేంద్ర, నవీన్, తేజ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక జ్ఞాన భారతి విద్యా సంస్థలలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ముగింపు వేడుకలు నిర్వహించారు. విద్యా సంస్థల కార్యదర్శి జోహర్ ఖాన్ అధ్వర్యంలో అమర్ రహే - అమర్ రహే, అమర్ రహే జవానే అమర్ రహే అంటూ 7వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులు డబ్బురి వీధి నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి అమరవీరులైన జవాన్లకు ఘనంగా నీరాజనాలు అర్పించారు. ఈ సందర్భంగా 8 నుండి 10వ తరగతి విద్యార్థులకు" లైంగిక వేధింపుల నుండి మహిళలు, పిల్లల రక్షణ సామాజిక పాత్ర". అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ర్యాలీలో ప్రిన్సిపల్ ఐ.బి పండ, మేనేజర్ ప్రమోద్ కుమార్, ఎఒ ప్రేమ్ సర్తాజ్ ఖాన్, పిఇటి కైలాస్ కుమార్ పండ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


నిత్యావసర సరుకులు అందిస్తున్న దాసరి రాజు

జన సైనికుల ఉదారత

కవిటి: మండలంలో జన సైనికులు మరోసారి తమ ఉదారత చాటుకున్నారు. కొత్తపాలెం గ్రామంలోని 16 నిరుపేద కుటుంబాలకు ఒక్కొక్క బియ్యం బస్తాతో పాటు నిత్యావసర సరుకులను ఇచ్ఛాపురం జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు చేతులు మీదుగా శుక్రవారం సాయంత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఈశ్వరరావు, మత్స్యకార వికాస విభాగ రాష్ట్ర కార్యదర్శి నాగుల హరి బెహరా, డి.దివాకర్, అంగ సురేష్, ఆర్.భాస్కర్, లోళ్ల ధనుంజయం, రాజు, హేమ చలపతి, రాజశేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- పోలాకి

ఈదులవలస ఎపి మోడల్ స్కూల్ విద్యార్థిని ఫెన్సింగ్ పోటీల్లో అండర్-19 విభాగంలో యారబాటి మౌనిక రాష్ట్రస్థాయికి ఎంపికవ్వడం పట్ల ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్కూల్‌లో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల దుప్పలవలస రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లాస్థాయి పోటీల్లో విజయం సాధించిందని, నవంబర్ 1,2,3 తేదీల్లో నంద్యాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ విద్యార్థిని పాల్గొననున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎం.నీలం పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలోనే ఉద్దాన ప్రాంతం అభివృద్ధి

ప్రజాశక్తి - పలాస

వైసిపి ప్రభుత్వంలో ఉద్దాన ప్రాంతం అభివృద్ధి చెందిందని పలాస జెడ్‌పిటిసి ప్రతినిధి, వైసిపి నాయకులు మచ్చ ధనరాజ్ అన్నారు. మండలంలోని కొబ్బరిచెట్టూరు గ్రామంలో శుక్రవారం గడప గడపకు నిధులు రూ. 5.50 లక్షల వ్యయంతో నిర్మాణం చేయనున్న సిసి రోడ్లుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని, ప్రతీ సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం పథకం ద్వారా రూ. 20 లక్షలు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. అందులో భాగంగానే గ్రామాల్లో సిసి రోడ్లు, కాలువలు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఉద్దాన ప్రాంతం అభివృద్ధికి సహకరిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సొర్రా పద్మావతి, సర్పంచ్ ప్రతినిధి, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి సొర్రా తిరుపతిరావు, ఎంపిటిసి కోరాడ నిరోషా, వైసిపి నాయకులు కోరాడ ధనరాజ్, వైసిపి నాయకులు పాతిని జానకిరావు, తామడ క్రాంతి, తామడ మనోజ్, దుమ్ము ధర్మారావు, సొర్రా ధర్మారావు పాల్గొన్నారు.


సిసి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ధనరాజ్

గ్రామ నామాలు గ్రంథ బహూకరణ

ప్రజాశక్తి- పొందూరు

స్థానిక ప్రముఖ నామ విజ్ఞానవేత్త వాంద్రంగి కొండలరావు తాను రాసిన 'గ్రామ నామాలు (ఆంధ్రప్రదేశ్)' గ్రంథాన్ని ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ సిహెచ్ ప్రసాదరావుకు శుక్రవారం బహూకరించారు. 2017లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో "ఊరు-పేరు(ఆంధ్రప్రదేశ్)అనే పుస్తకాన్ని కొండలరావు రాశారు. ఈ పుస్తక ప్రతుల్లో కొన్నింటిని కోల్‌కత్తాలోని రాజారాం మోహన్‌రాయ్ ఫౌండేషన్ కొనుగోలు చేసి ప్రోత్సాహించింది. ఈ గ్రంథం తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటక ప్రాంతాల్లోని తెలుగు పాఠకుల ఆదరణ పొందింది. కాగా 2016 మార్చి 19న విశాఖపట్నంలో ఆవిర్భవించిన ఉత్తరాంధ్ర తెలుగు రచయితల వేదికపై "వ్యక్తి నామ విజ్ఞానం"పై సమగ్ర పత్రాన్ని సమర్పించారు. "ఊరు-పేరు(ఆంధ్రప్రదేశ్) పుస్తకానికి సంబంధించి ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలో కొండలరావు సుదీర్ఘ ప్రసంగం చేశారు. అలాగే ఈ పుస్తకంపై ప్రముఖ కథారచయిత సర్వసిద్ధి హనుమంతరావు ఇదే కేంద్రంలో సమీక్ష నిర్వహించారు. సమకాలీనంలో రాష్ట్రస్థాయిలో గ్రామనామాలు అంశంపై విశేష కృషి చేస్తున్న రచయిత కొండలరావును ఎస్‌బిఐ ముఖ్య ప్రబంధకులు ప్రసాదరావు అభినందించారు.


పుస్తకాన్ని బహుకరిస్తున్న రచయిత కొండలరావు